# ★ అభ్యుదయము ★

శ్రీమతి కొమ్మూరి ఉషారాణి బి. ఎ.

శేఖర్ ఆనందరావుగారి ఏకైకపుత్రుడు. చిన్నప్పటినుంచి శేఖరంటే తండ్రికి ఎంతో ముద్దు. క్లాసులో అంత మంచి మార్కులు రాకపోయినా తప్ప కుండా నెగ్గుకొచ్చేవాడు. తను చాలా అందమైనవాడనని, తెలివి తేటల్లో తన్ను మించిన వాళ్లు ఎవరూ లేరనీ అతనికి చాలా గర్వం అహంభావం ఉండేవి. దానికితోడు మన స్తత్వశాస్త్రం మొయిను సబ్జక్టుగా తీసుకోవడం అతని గర్వాన్ని హెచ్చుచేశాయి. ఇంటికి వచ్చిన ప్రతివాళ్లకీ తనకొడుకు మనస్తత్వ శాస్త్రాన్ని స్పెషలయిజు చేస్తున్నాడని గొప్పగా చెప్పుకునేవాడు ఆనందరావు.

శేఖర్ని అంత కురూపి అనడానికి వీల్లేదుగాని చూడటానికి చాలా గమ్మత్తుగా ఉండేవాడు. పొడుగ్గా, సన్నగా, చామనచాయ రంగులో ఉండేవాడు. ప్రత్యేకాకర్షణ అతనిలో లేకపోయినా, అతన్ని చూచిన వాళ్లందరికీ మరొకసారి ఆతని ముఖం చూడాలనే కోరిక పుట్టేది. ఎంతో శ్రద్ధతో సన్నగా కత్తిరించిన అతని మీసాలు నవ్వినప్పుడు మరింత తమాషాగా ఉండేవి. శేఖర్ చాలా వింతయిన వ్యక్తి. సినిమాకి వెళ్తున్నా, బీచీకి వెళ్తున్నా నల్లటి లావుపాటి పుస్తకాన్నతడెప్పుడూ చేతిలో పట్టుకు తిరుగుతూండేవాడు. బస్సులోనూ ట్రాములోనూ ప్రయాణం చేస్తునప్పుడు ఆ ప్రయాణం అయిదు నిముషాలు పట్టేదైనాసరే, చేతిలో పుస్తకాన్ని తెరిచి అందులోని పేజీలను తిరగేస్తూ ఉండేవాడు.

శేఖర్ ప్రవర్తన అతని స్నేహితులందరికీ కొంచెం ఆశ్చర్యాన్ని కలిగించాయి. కొందరు అతన్ని చూసి హేళన చేసేవారు. మరి కొందరు అతన్ని మెచ్చుకొనేవారు. సుదర్శనానికి మటుకు శేఖరంటే ఒక విధమైన ఆకర్షణ ఏర్పడింది. అతనికి శేఖరంటే ఎక్కువ యిష్టంగూడా లేదు. శేఖర్ని అర్థం చేసుకోవడం చాలా కష్టమనీ అతనొక అతీతమైన స్వరూపమనీ అనుకునేవాడు సుదర్శనం.

ఒకరోజు యథాప్రకారం శేఖర్ కాలేజీకి బయలుదేరాడు. చేతిలో పుస్తకం తెరిచివుంది. ఆతనికళ్లు పుస్తకంలోని పేజీలను తినేస్తున్నాయి. ఎందుకో అనుకోకుండా తలపైకెత్తి చూశాడు. ఎదురుగుండా ఒక అందమయిన అమ్మాయి కూర్చునివుంది కొంచెం నవనాగరీకిగా దుస్తులు ధరించినా దానికి తగ్గ అందం ఆమెలో వుంది, తలెత్తి ఆ అమ్మాయిని చూసిన శేఖర్ మళ్లా తల దించుకోలేదు. ఆఅమ్మాయి ఏమైనా అనుకుంటుందేమోనని గూడా అతనికి తోచలేదు.

గమ్యస్థానం రావడంవల్ల ఆ అమ్మాయి దిగిపోతూ అతన్ని గర్వంగా చూసింది.

ఆరోజంతా శేఖర్‌కి ఏమి తోచలేదు. అతనిలా అవడానికికారణం ఏమిటి? మనస్తత్వశాస్త్రం చదువుతున్న తను ఆమాత్రం తెలుసుకోలేకపోతే ఎట్లా? వెంటనే పుస్తకాలన్నీ తిరగేశాడు. తను యింతకు ముందర చదివిన ప్రేమ కథలన్నిటినీ స్మరించుకున్నాడు. తనమీద తప్పకుండా ఆ అమ్మాయికి గూడా ప్రేమ పుట్టివుండాలని నిశ్చయించుకున్నాడు. రేడియోలో "ఎంత ఘాటు ప్రేమయో" "కాదుసుమా కల కాదుసుమా కలకాదుసుమా" పాటలు వచ్చినపుడు శేఖర్ ఉక్కిరి బిక్కిరి అయేవాడు.

అకస్మాత్తుగా ఓరోజున శేఖర్ సుదర్శనం యింటికి వెళ్లాడు పుస్తకం కోసరం. సుదర్శనం యింట్లో లేడు. శేఖర్ని ఆరోజు బస్సులో ఉక్కిరి బిక్కిరి చేసిన అమ్మాయి లోపల నుంచే వచ్చింది. స్నేహితుడు రాడని తెలిసినా శేఖర్ కుర్చీలో చతికిల బడ్డాడు. పార్వతి చదువుకున్నది కాబట్టి భర్త స్నేహితులతో మాట్లాడకపోతే బాగుండదని ఎదురుగా కూర్చుంది.

"మీ పేరు" అన్నాడు శేఖర్ పోజు పెట్టి.

"పార్వతి" అంది.

"ఎంత చక్కటిపేరు మీలాగా ఎంతో అందంగా" వుందన్నాడు శేఖర్. పార్వతి ఉలిక్కి పడింది. ఇతని కేమైనా పైత్యమేమో ననుకుంది. వెంటనే యిలా అనుకున్నాడు శేఖర్. "మిమ్మల్ని బస్సులో చూచినప్పటినుంచి నాలో ఎన్నడూ లేని ఆనందం ఉత్సాహం బయలుదేరాయి. అంధకార బంధురంలో వున్న నాయీ జీవితానికి మీ చూపులు ఒక వెలుగు నిచ్చాయి. ఇంతకంటే నేనిప్పుడేమి చెప్పలేను" అంటూ గిరుక్కున తిరిగి వెళ్లి పోయాడు.

పార్వతికి ముందర కోపం వచ్చింది. తరువాత పడీ పడీ నవ్వటం మొదలెట్టింది. ఎందుకో భర్తకి ఈసంగతి చెప్పటానికి వెనుదీసింది. శేఖరానికి కొంచెం పిచ్చేమో ననుకుంది. ఆ తరువాత శేఖర్ తరుచూ సుదర్శనం యింటికి వెళ్లేవాడు. వాళ్ల సంభాషణల్లో పార్వతికూడా అప్పుడప్పుడూ పాల్గొనేది. అవసరం లేకపోటటో మరే కారణం చేతనో సుదర్శనం పార్వతి తన భార్యయని శేఖర్‌కి చెప్పలేదు. పార్వతి అనుకున్నట్లు సుదర్శనం పిచ్చివాడి కూచనలు చూపకపోయినా, ఆతని అర్ధనిమీలిత నేత్రాలూ వంకర చూపులూ ఆమెకు బాధ కలిగించేవి. ఏవిషయం తర్కించినా తన్నుమించిన తెలివైనవాడు లేడనీ, లోకంలో వున్న సమస్త విషయాలూ తనకే తెలుసుననే అతని అహంభావం పార్వతికి అతనిమీద అసహ్యాన్ని హెచ్చు చేశాయి.

త్వరలోనే శేఖర్‌కీ సుదర్శనానికీ పార్వతికీ మధ్యవున్న సంబంధం తెలిసింది. కాని అతను కొంచెంగూడా చలించలేదు. తమాషా ఏమిటంటే అతనికి పార్వతి మీద "లవ్" ఎక్కువయింది. ఈ దుర్వార్త విన్న వెంటనే యింటికివెళ్లి గస్టోవు ఫ్లాబర్టు వ్రాసిన "మాడమ్ బవరీ" 'అన్నాకరేనా' మొదలగు పుస్తకాలని తిరగేసాడు. పెళ్లి కాని స్త్రీని ప్రేమించడంకంటె, పెళ్లయిన స్త్రీని ప్రేమించి, ఆమెచేతను ప్రేమించబడి, వారు సంఘాన్ని ఎదిరించడంలోనే గొప్పతనం వుందనుకున్నాడు. అందరు నడిచిన త్రోవనే తనెందుకు నడవాలి? ఈ వివాహం తను చేసుకుంటే ఆంధ్ర దేశంలో — అబ్బ! ఆంధ్ర దేశంలో ఏమిటి హిందూ సంఘములోనే తను పెద్ద విప్లవం తీసుకువచ్చిన వాడవుతాడు.

క్రమంగా శేఖర్ దృష్టి 'లా' పుస్తకాల మీదికి మళ్లింది. సుదర్శనానికి విడాకులిచ్చి పార్వతి తనన్ని ఎలా వివాహం చేసుకోవచ్చో వారిహక్కులేమిటో చాలా శ్రద్ధతో చదవ నారంభించాడు. ఆతనిలో ప్రేమ హెచ్చుస్థాయిలో నుండటంచేత, పరీక్ష పుస్తకాలకి కొంచెం విశ్రాంతి యిచ్చాడు, ఆ యేడు బి. ఏ. పరీక్షలు వ్రాస్తున్నప్పుడు అతనికి 'అన్నా కరేనా' 'మాడమ్ బవరీ' జ్ఞాపకం వచ్చారు. పరీక్ష తప్పాడు.

ఫలితాలు వచ్చిన నాటి సాయంత్రం పల్చటి లాల్చి, పైజామా వేసుకొని, నోట్లో సిగరెట్టుతో పార్వతి గుమ్మం ఎక్కాడు. "మీకివాళ ఒక శుభవార్త చెప్పడానికి వచ్చాను. నేను పరీక్ష తప్పాను" అన్నాడు. గుడిపాటి వెంకటచలాన్ని తల్చుకుంటూ "అయ్యో పాపం! ఒక ఏడంతా వృధా అవుతుంది" అంది పార్వతి.

"వృధా ఎందుకు అవుతుంది. వెన్నెలుండగా చంద్రుడి జీవితం వృధా అవుతుందా" అన్నాడు శేఖర్ చిరునవ్వుతో.

"మీమాటలు నాకర్థం కావటం లేదు" అంది పార్వతి చిరాగ్గా.

"అర్థం ఎలా అవుతుంది. ప్రేమ గుడ్డిది. ఇదిగో మిమ్మల్ని నేను ప్రేమిస్తున్నాను, మనిద్దరం వివాహం చేసుకుందాం. సంఘాన్ని ఎదిరిద్దాం, లోకాన్ని ధిక్కరిద్దాం. అన్నట్లు మీరెప్పుడైనా చలంగారి కథలు చదివారా? మంచి ప్లీడర్ని పెట్టి మీకు విడాకులిప్పిస్తాను. మన ప్రేమకెవరూ అడ్డురాలేరు. పుస్తె కట్టినంత మాత్రాన భర్తలవుతారా చలం అన్నట్టు. మీరు నన్ను ప్రేమిస్తున్నారు. మీకాసంగతి బాగా తెలుసు. మీ స్త్రీల మనస్తత్వం అదే. బయటికి చెప్పడానికి భయపడ్తారు. ఇది ఇరవయ్యవ శతాబ్దం. మన సంస్కారం, విజ్ఞానం చాలా ముందంజ వేశాయి. విజ్ఞానం బాగా అలవడి కావాలంటే మనుష్యుల్లో మార్పు

రావాలి. ఆ మార్పు ఒక్క రాజకీయకంగా గాక సాంఘికంగా గూడా రావాలి. పాశ్చాత్య దేశాల్లో చూడండి ఎంత స్వేచ్ఛననుభవిస్తారో స్త్రీ పురుషులు. మీరు నేనూ గూడా చదువుకున్నాం ఇంత చదువూ చదివి, ఇన్ని పాశ్చాత్య నవలలు పఠించిన మనం ఇంత మాత్రం సాహసించలేకపోతే ఎట్లా! త్వరపడండి. మీ జవాబు ఏమిటి' అన్నాడు శేఖర్ గుక్క తిప్పుకోకుండా.

"శేఖర్ గారూ మిమ్మల్ని చూస్తూంటే నాకు చాలా జాలివేస్తూంది. మీ రడిగిన చలం పుస్తకాలు నేనేమి చదవలేదు. నాకూ సుదర్శనానికీ అయిదేళ్ల క్రిందట వివాహం అయింది. అప్పుడు ప్రేమంటే నాకేమీ తెలియదు. ఆయనే నన్ను యింటర్మీడియేటు వరకు చదివించారు. మేమిద్దరం పెళ్లిముందర కథల్లో లాగ ప్రేమించుకో పోయినా ఇప్పుడు చాలా అన్యోన్యంగా వుంటున్నాము. విజ్ఞానం పెంపొందించాలంటే మీరన్నట్లు మన హిందువులు కొంతవరకు పాశ్చాత్యులను అనుకరించి బాగుపడాలనుకునేవారు ఇతరుల్లో వుండే మంచిని గాని చెడునిగాని ఎప్పుడూ అనుకరించరు. పాశ్చాత్య పద్ధతులలో వుండే మంచిని మనం అనుకరించవచ్చు కాని మన సంఘ మర్యాదలు, నైతిక జీవనం వారి జీవనానికి విరుద్ధంగా వుంటుంది మీరు నిజంగా చదువుకుని సంస్కారం అలవరచుకోవాలంటే ఇటువంటి పిచ్చి అభిప్రాయాలను మానుకోండి. అభ్యుదయం, ముందంజ, సంస్కారం అంటే ఇవి కావు. మీరు చాలా పొరబడుతున్నారు' అన్నది.

ఆ తరువాత శేఖర్ మూర్ఛపోయాడో, పిచ్చెక్కి పిచ్చాసుపత్రికి చేర్చబడ్డాడో ఎవరూ సరిగ్గా చెప్పలేదు. పార్వతి ఆ సంగతి అడుగుతే నవ్వుతుంది. ఈ కథంతా విన్న సుదర్శనానికి పెద్ద షాక్ యిచ్చింది. ఇప్పటికీ పార్వతి అంటూవుంటుంది.

"ఈ కాలం కుర్రాళ్లకి మరీ పైత్యం ఎక్కువవుతోందని".

## కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స :—

క్యాటలాగు ఉచితము.

భాస్కర తైలము:- సర్వనొప్పులకు, కర్ణరోగములకు, దెబ్బలకు, తెగవులకు, పుండ్లకు, విషజంతువుల కాట్లకు, కలరా, ఋతుశూలలు వగైరా అన్ని స్త్రీవ్యాధులకు గ్యారంటీగా పనిచేయును సీసా వెల రు 2-0-0 లు. పూర్తి వివరములకు :

**జి. వి. రెడ్డి అండ్ కో** (రిజిష్టర్డు)

"భాస్కరాశ్రమము", గోపాలపురం, తూర్పుగోదావరిజిల్లా.